సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 14 । జూలై । 2024



పేదలకు వరం

పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో ▸



బీఆర్‌ఎస్ ఖాళీ..

లోక్‌సభ ఎన్నికల వరకు ఎంతో పటిష్టంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ.. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో ఖాళీ అయింది. 8లో ▸



కేంద్ర మంత్రికి సన్మానం

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి సన్మానించారు. 8లో ▸

న్యూస్‌రీల్

అంతారంలో మైనింగ్ వద్దు



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

చేవెళ్ల: మండలంలోని అంతారం గ్రామంలో నిర్వహిస్తున్న మైనింగ్ తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని, కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.మహేందర్ డిమాండ్ చేశారు. గ్రామంలో మైనింగ్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని శనివారం సంఘం నాయకులు పరిశీలించారు. మైనింగ్‌తో చుట్టు పక్కల గ్రామాలకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్టను ఇప్పటికే నేలమట్టం చేశారని అన్నారు. ఈ నేలలో విలువైన ఖనిజ సంపదను దోచుకునేందుకు మైనింగ్ కాంట్రాక్టర్ అధికారులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపారని ఆరోపించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారే కానీ వారు దీనిని వ్యతిరేకించడాన్ని మాత్రం లెక్కలోకి తీసుకోవటం లేదన్నారు. మైనింగ్ తవ్వకాలతో జరుగుతున్న నష్టాలను గుర్తించి వెంటనే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గురుగుబెల్లి యతిరాజులు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న యతిరాజులు

నందిగామ: న్యాయ శాస్త్రం అభ్యసించే విద్యార్థులు చట్టాలపై లోతైన అవగాహన పెంచుకోవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గురుగుబెల్లి యతిరాజులు సూచించారు. మోదళ్లగూడ శివారులోని సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలోని లా కాలేజీలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సుతో పాటు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యతిరాజులు మాట్లాడుతూ.. చట్టాల్లో వస్తున్న మార్పులు, ప్రపంచ వ్యాప్తంగా పలు కోర్టులు ఇస్తున్న తీర్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ మేరకు పుస్తకాలను అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం కళాశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యకవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

చేవెళ్ల: బ్రాహ్మణులంతా ఐకమత్యంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం జిల్లా బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘంలోని సీనియర్ నాయకులు రిటైర్డు జడ్జి జానకిరామారావు, రిటైర్డు తహసీల్దార్ వి.రామారావు, ఎ.రఘువీర్ పండిత్‌ల పర్యవేక్షణలో శ్రీధర్‌రావు అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.రాఘవరావు, ప్రధాన కార్యదర్శిగా ఎల్‌కే సృజన్‌కుమార్, ఉపాధ్యాక్షులుగా బి.విరాట్ స్వరూప్, అనిల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ఎస్.కిషన్‌రావు, కె.సంతోస్, కోశాధికారిగా మోహన్‌రావు, సహాయ కార్యదర్శులుగా రవిశర్మ, ఆర్‌పీ సుబ్రహ్మణ్యం, పవన్‌కుమార్‌శర్మ, ఆనంద్‌శర్మ, మహిళా అధ్యక్షురాలిగా స్వప్నసతీష్, కార్యనిర్వహక కార్యదర్శిగా బీసీ నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారు బ్రాహ్మణుల సమస్యలపై చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

చేతిలో కారుచిచ్చు!

హస్తం గూటికి గులాబీ ఎమ్మెల్యేలు

- వలస నేతల వరుసతో అసంతృప్తి
- నియోజకవర్గ ఇన్‌చార్జుల పరిస్థితేంటి?
- గ్రేటర్ కాంగ్రెస్ కేడర్‌లో గందరగోళం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ కాంగ్రెస్ పార్టీకి కొత్త కష్టమొచ్చింది. వలసల పర్వం ఆ పార్టీలో అసంతృప్తిని రాజేస్తోంది. మొన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న నేతలను అక్కున చేర్చుకుంటున్న తీరును ద్వితీయ శ్రేణి నాయకత్వం తప్పుపడుతోంది. పార్టీ బలోపేతం పేరిట గులాబీ నాయకులకు స్వాగతం పలుకుతుండడం సీనియర్లకు మింగుడు పడడంలేదు. ఒకవైపు పార్టీ బలీయంగా తయారవుతుందనే సంతోషపడుతున్నా.. మరోవైపు తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందనే ఆందోళన వారిని వెంటాడుతోంది. ఇటీవల బీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరికొందరు కండువా కప్పుకునేందుకు ముహూర్తం కూడా ఖరారు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరి రాక తమ ఉనికికి భంగం కలిగిస్తుందనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పార్టీ అసమ్మతులకు తెరలేపింది. ఇటీవల చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీలో చేరడంతో మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసిన భీంభరత్ వర్గం అసంతృప్తికి గురైంది. పార్టీలో చేర్చుకోవద్దని చివరి నిమిషం వరకు ప్రయత్నించినా ఫలించకపోవడంతో సర్దుబాటుకు సరే అంది. అయితే.. మనుషులు కలిసినా మనసులను కలపలేమనే సంకేతాలు ఇరువర్గాలు ఇస్తున్నాయి.

రాజేంద్రనగర్‌లోనూ..

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అందరికంటే ముందే రేవంత్ భేటీ అయి కండువా కప్పుకొన్న ప్రకాశ్.. మొన్నటి వరకు ఆగినా చివరకు కారు దిగి చేయి పట్టుకున్నారు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీచేసిన నరేందర్, సీనియర్ నేతలు జ్ఞానేశ్వర్, ముంగి జైపాల్‌రెడ్డి వర్గీయులు అసంతృప్తికి లోనయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గంలో వేరు కుంపట్లతో కాంగ్రెస్ ఎలా ముందుకు సాగుతుందో వేచిచూడాల్సిందే మరి!

శేరిలింగంపల్లిలో మూడు గ్రూపులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శనివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ మూడు గ్రూపులుగా విడిపోయింది. శాసనసభ ఎన్నికల వేళ టికెట్ ఆశించిన జైపాల్ సహా.. ఆఖరి నిమిషంలో బీఆర్‌ఎస్‌ను వీడి టికెట్ దక్కించుకున్న జగదీశ్వర్‌గౌడ్ ఇప్పటికే రెండు వర్గాలుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా గాంధీ రాకతో కాంగ్రెస్‌లో మూడో వర్గానికి తెరలేపింది.

ఖైరతాబాద్‌తో మొదలు..

పరువు పోయిన చోటే వెతుక్కోవాలన్న ఉబలాటంతో ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీ. లోక్‌సభ ఎన్నికలకు ముందే నగరంలో గులాబీ తొలి వికెట్‌గా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పార్టీలో చేర్చుకొని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి ప్రయోగించింది. ఇటీవల దానం బాటలోనే జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దానం చేరికతో ఆయనపై పోటీ చేసి ఓటమి పాలైన విజయారెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

డైలమాలో నేతలు

ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు కార్పొరేటర్లను చేర్చుకోవడం ద్వారా గ్రేటర్‌లో పార్టీని పటిష్ఠం చేసే దిశగా అడుగులు వేస్తున్న పీసీసీ నాయకత్వం ఆపరేషన్ ఆకర్ష్‌కు మరింత పదును పెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మరింత మంది ఎమ్మెల్యేలకు గాలం విసిరింది. ఇప్పటికే వీరితో సంప్రదింపులు కూడా జరిపింది. అయితే.. వీరి రాకపై సంకేతాలు రావడంతో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతలకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. తాము ఓడినా.. అధికారంలోకి వచ్చామనే సంతోషంలో ఇన్నాళ్లూ ఉన్న తమను తాజా పరిణామాలు ఆవేదన కలిగిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. కొత్తగా చేరిన నాయకుల కింద తమ శ్రేణులు పనిచేయాల్సిన పరిస్థితి అనివార్యం కావడం.. పార్టీ కోసం కృషి చేసిన దిగువ శ్రేణి నాయకుల పదవులను కొత్త నేతల అనుచరులు తన్నుకుపోయే ప్రమాదం ఉండడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్

ఆస్తి కోసమే తండ్రి హత్య

- వీడిన కమ్మరి కృష్ణ హత్య మిస్టరీ
- బాడీ గార్డుకు సుపారీ ఇచ్చి అంతమొందించిన కొడుకు
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు
- రెండు కార్లు, కత్తులు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ రాజేశ్

షాద్‌నగర్ రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారి కమ్మరి కృష్ణ అలియాస్ కేకే హత్య మిస్టరీ వీడింది. ఆస్తి కోసం కన్నకొడుకే తండ్రిని హత్య చేయించాడు. తండ్రి సంపాదించిన ఆస్తిలో తమ వాటా తగ్గుతుందనే ఉద్దేశంతో బాడీగార్డుకు సుపారీ ఇచ్చి అంతమొందించాడు. కమ్మదనం గ్రామ శివారులో ఈనెల 10న జరిగిన హత్యకు సంబంధించిన వివరాలను శనివారం షాద్‌నగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో శంషాబాద్ డీసీపీ రాజేశ్ విలేకరులకు వెల్లడించారు.

ముగ్గురితో వివాహం

రాజేంద్రనగర్ పరిధిలోని బండ్లగూడ జాగీర్, సన్‌సిటీ రఘురాం నగర్ కాలనీకి చెందిన కమ్మరి కృష్ణ షాద్‌నగర్ పరిధిలోని కమ్మదనం శివారులో వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేసి అందులో ఫాంహౌస్ నిర్మించాడు. ఇతనికి ముగ్గురు భార్యలు. మొదటి భార్య పక్షవాతం బారిన పడి మంచానికే పరిమితమైంది. అనంతరం రెండో వివాహం చేసుకోగా కరోనా సమయంలో ఆమె హఠాత్తుగా మరణించింది. దీంతో పావని అనే మహిళను మూడో పెళ్లి చేసుకుని తన ఫాంహౌస్‌లో ఉంచి, అప్పుడప్పుడూ వచ్చివెళ్తుండేవారు. ఇదిలా ఉండగా పెద్ద భార్యకు ఇద్దరు కొడుకులు, మూడో భార్యకు 16 నెలల పాప ఉండగా, రెండో భార్యకు పిల్లలు లేరు.

రూ.16 కోట్ల ఆస్తి మార్పిడి

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కేకే వందల కోట్ల రూపాయల ఆస్తులు సంపాదించాడు. రూ.16 కోట్ల విలువ చేసే ఓ భవనాన్ని ఇటీవల తన మూడో భార్య పావని పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. కొంతకాలంగా పెద్ద భార్య కొడులను పట్టించుకోవడం మానేశాడు. ఈ నేపథ్యంలో పెద్ద భార్య కొడుకు శివకు, తండ్రి కృష్ణకు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.

తండ్రి హత్యకు సుపారీ

తండ్రి సంపాదించిన ఆస్తిని మూడో భార్యకే కట్టబెడుతాడని కోపం పెంచుకున్న శివ.. కేకే హత్యకు ప్లాన్ చేశాడు. ఈ నేపథ్యంలో తండ్రి వద్ద బాడీగార్డుగా పనిచేస్తున్న కాలామందిర్‌కు చెందిన బాబా అలియాస్ శివానంద్‌తో చేతులు కలిపాడు. తన తండ్రిని హత్య చేస్తే రూ.25 లక్షలతో పాటు ఓ ఇల్లు ఇస్తానని సుపారీ మాట్లాడుకున్నాడు.


గొంతుకోసం.. పొట్టలో పొడిచి

కమ్మదనం ఫాంహౌస్‌లో ఉన్న కేకేను హత్య చేసేందుకు బాడీగార్డు బాబా.. బండ్లగూడ జాగీర్, కాలీమందిర్ ప్రాంతానికి చెందిన జీలకర్ర గణేశ్‌తో పాటు మరో 17 ఏళ్ల మైనర్‌ను పిలిపించాడు. కేకే ఫాంహౌస్‌లో ఉండగా వీరిద్దరూ వెనక నుంచి వచ్చి కృష్ణ చేతులను గట్టిగా పట్టుకున్నారు. అనంతరం బాబా తన వెంట తెచ్చుకున్న కత్తితో కృష్ణ గొంతు కోసి, పొట్టలో పొడిచి హత్య చేశారు.

కార్లు, కత్తులు స్వాధీనం

కృష్ణను హత్య చేసిన తర్వాత బాబా, గణేశ్, మైనర్ బాలుడితో కలిసి కారులో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సమయంలో ఫాంహౌస్ వద్ద ఉన్నవారిని బొమ్మ తుపాకీతో బెదిరించారు. హత్య విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కమ్మరి శివ, బాబా, గణేశ్, మైనర్‌ను పట్టుకున్నారు. క్లూస్ సేకరించిన ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానంతో హత్య మిస్టరీని ఛేదించారు. వీరి నుంచి రెండు కార్లు, ఓ బైక్, మూడు కత్తులు, సెల్‌ఫోన్, రూ.50 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 103, 3(5), 61 బీఎన్‌ఎస్, 25 (1బీ)(ఏ) ఆర్మ్స్ యాక్టు కింద కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ రామిరెడ్డి, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐలు వరప్రసాద్, శరత్, శ్రీకాంత్, సుశీలతో పాటు పలువురు సిబ్బందిని అభినందించి, రివార్డులు అందజేశారు.

అపార్ట్‌మెంట్‌లోకి దూసుకొచ్చిన తూటా



అపార్ట్‌మెంట్ కిటికీకి రంధ్రం (ఇన్‌సెట్‌లో) ఇంట్లో పడిన బుల్లెట్

బైరాగిగూడలో ఘటన

మణికొండ: బైరాగిగూడలో ఓ అపార్ట్‌మెంట్ బెడ్రూం కిటికీ అద్దాల్లోంచి తూటా దూసుకువచ్చి గోడకు తగిలిన ఘటన శనివారం చోటుచేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగిగూడలోని ఓ అపార్ట్‌మెంట్ అయిదో అంతస్తులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సిద్ధార్థ్ ఉంటున్నారు. శనివారం ఆయన ఉదయం తన భార్యతో కలిసి కిందకు వెళ్లి వాకింగ్ చేస్తున్నారు. ఇంతలోనే ఓ తూటా వీరి ఇంట్లోని బెడ్రూం కిటికీ అద్దాలను చీల్చుకుంటూ వచ్చి గోడకు తగిలింది. ఆ శబ్దానికి ఇంట్లోని పెంపుడు కుక్క పెద్దగా అరవటంతో వాకింగ్ చేస్తున్న సిద్ధార్థ్ ఇంట్లోకి వచ్చారు. కిటికీకి రంధ్రం ఉండటం, బెడ్రూంలో తుపాకీ తూటా కింద పడి ఉండటాన్ని గమనించి ఎవరో తన ఇంటిపై కాల్పులు జరిపారని భయాందోళనకు గురయ్యారు. నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి సీఐ హరికృష్ణారెడ్డి పరిశీలించారు. పక్కనే ఉన్న తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి వచ్చి ఉంటుందని, వారు శుక్రవారం నుంచి ఫైరింగ్ శిక్షణ ఇస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. పక్కనే ఉన్న ఇబ్రహీంబాగ్ మిలిటరీ ఫైరింగ్ రేంజ్ నుంచి బుల్లెట్ వచ్చి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఫైరింగ్ రేంజ్‌లకు సమీపంలో అపార్ట్‌మెంట్‌లకు అనుమతులు ఇవ్వటం, ఇలాంటి సంఘటనలు జరిగితే ప్రాణనష్టం సంభవిస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే తరహాలో ఇబ్రహీంబాగ్ రెజిమెంట్ నుంచి మణికొండ క్వార్టర్స్‌లోకి బుల్లెట్‌లు వచ్చి పడ్డాయని స్థానికులు గుర్తు చేశారు.

పరిహారం అందేలా చూడండి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బండరావిరాల సర్వే నంబర్ 268లోని మైనింగ్‌జోన్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాలకు చెందిన నిర్వాసితులు బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిశారు. కొన్నేళ్లుగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తూ వస్తున్నాయని అన్నారు. తమకు నష్టపరిహారం అందించడంతో పాటు అక్రమంగా కొనసాగుతున్న మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు ప్రతాప్, పాపయ్య గౌడ్, కొండల్ రెడ్డి, అంజయ్య, ప్రేమ్, శ్రవణ్ చారి, కుమార్ గౌడ్, లింగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు

షాద్‌నగర్‌రూరల్: తమిళనాడులోని అరుణాచల క్షేత్రంలో గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు షాద్‌నగర్ నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21న పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును షాద్‌నగర్ డిపో నుంచి నడిపిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19న రాత్రి 7 గంటలకు షాద్‌నగర్ నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరి 20న ఉదయం 6 గంటలకు కాణిపాకం, సాయంత్రం 4 గంటలకు వేలూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత అదేరోజు రాత్రి అరుణాచలం క్షేత్రానికి చేరుకుంటుందని వివరించారు. క్షేత్రంలో గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 21వ తేదీ సాయంత్రం 4గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరి 22న ఉదయం 5గంటలకు షాద్‌నగర్ చేరుకుంటుందని చెప్పారు. పెద్దలకు రూ.3,600, చిన్న పిల్లలకు రూ.2,400 చార్జీ వసూలు చేయనున్నట్లు తెలిపారు. టికెట్ల బుకింగ్ కోసం షాద్‌నగర్ డిపోలో నేరుగా గానీ, 99592 26287, 91826 45281, 94900 21433 నంబర్లలో గానీ సంప్రదించవచ్చని సూచించారు.

చైర్మన్ పదవి ఎవరికి దక్కేనో?

త్వరలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- పదవుల కోసం తీవ్ర పోటీ
- ఎవరికి వారే ప్రయత్నాలు
- బడా నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు



మహేశ్వరం మార్కెట్ కమిటీ కార్యాలయం

మహేశ్వరం: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాన్ని నియమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వ్యవసాయ మార్కెట్లకు త్వరలో పాలకవర్గాలను ప్రకటిస్తామని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ప్రకటించింది. జిల్లాలో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలకు త్వరలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను నియమించనుంది. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్టీ జనరల్‌కి కేటాయించారు. దీంతో పాలకవర్గాలకు సారథ్యం వహించే చైర్మన్ పదవుల కోసం అధికార పార్టీలో పోటీ తీవ్రంగా నెలకొంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిలను ప్రసన్నం చేసుకునేపనిలో ఆశావహులు నిమగ్నమయ్యారు.

ఎవరికి వారే ప్రయత్నాలు

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం గిరిజన కాంగ్రెస్ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు ఒక్కొక్కటిగా పాలకవర్గాలను నియమిస్తుండడంతో ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గం 2015లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియమించింది. మొదటిసారిగా ఓసీ మహిళ, రెండోసారి ఓసీ మహిళ, మూడోసారి ఓసీ జనరల్, ప్రస్తుతం నాలుగోసారి ఎస్టీ జనరల్‌గా రిజర్వేషన్ కేటాయించారు. మహేశ్వరం మార్కెట్ కమిటీకి మొదటి సారి చైర్‌పర్సన్‌గా 2015లో కందుకూరు మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గంగాపురం జ్యోతిరెడ్డి, రెండోసారి చైర్‌పర్సన్‌గా కందుకూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన సురసాని వరలక్ష్మీరెడ్డి, మూడోసారి కందుకూరు గ్రామానికి చెందిన సురసాని సురేందర్‌రెడ్డి చైర్మన్లుగా నియమితులయ్యారు. ప్రస్తుతం నాలుగోసారి ఎస్టీ జనరల్‌కి రిజర్వేషన్ ఖరారైంది.

పదవిని ఆశిస్తున్న ఆశావహులు

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్టీ జనరల్ రిజర్వు కావడంతో పదవిని ఆశిస్తున్న ఎస్టీ నేతలు పోటీ పడుతున్నారు. ప్రధానంగా మహేశ్వరం మండలం నుంచి మాజీ కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, ఉప్పుగడ్డ తండా గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ నేనావత్ రాజు నాయక్, గంగారం తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముడావత్ పాండు నాయక్, రామచంద్రగూడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంగోత్ కృష్ణా నాయక్, కందుకూరు మండలానికి చెందిన మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సబావత్ కృష్ణా నాయక్, సార్లరావులపల్లి తండాకు చెందిన కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఇస్లావత్ ఆంజనేయులు నాయక్, పెద్దమ్మ తండాకు చెందిన సభావత్ లచ్చా నాయక్ చైర్మన్ కోసం పోటీ పడుతున్నారు. గత మూడు సార్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కందుకూరు మండలానికి చెందిన నాయకులనే వరించింది. ఇప్పటి వరకు మహేశ్వరం మండలానికి చెందిన వారికి రాలేదు. కేవలం వైస్ చైర్మన్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

పార్టీ కోసం కష్టపడ్డ వారికే చాన్స్..

మహేశ్వరం మండలానికి చెందిన వారికే ఈ సారి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరిస్తుందని, వైస్ చైర్మన్ కందుకూరు మండలానికి చెందిన వారికి ఇస్తారని కాంగ్రెస్ అగ్రనేతలు అంటున్నారు. చైర్మన్ పదవిని కాంగ్రెస్ కోసం కష్టకాలంలో ఉండి పార్టీలు మారకుండా పార్టీనే నమ్ముకున్న వారికి ఇస్తారంటున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వకపోవచ్చని పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీ కోసం పని చేసిన వారిలో మహేశ్వరం మండల మాజీ కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్ తనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని పట్టుపడుతున్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, ఎస్టీ సెల్ కాంగ్రెస్‌లో పని చేశారు. 2019లో సబితా రెడ్డి కాంగ్రెస్ పార్టీలో గెలుపొంది బీఆర్‌ఎస్‌లో చేరేటప్పుడు ఆమెతో పాటు చేరకుండా పార్టీనే అంటిపెట్టుకొని మనో ధైర్యంతో పార్టీలోనే కొనసాగానని, బీఆర్‌ఎస్ నేతలు పార్టీ మారాలని తీవ్ర ఒత్తిడి చేసినా, అక్రమ కేసులు పెట్టినా వాటన్నింటినీ తట్టుకొని కష్టకాలంలో పార్టీ కోసం పని చేశానని చెబుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నాయని, తనకే చైర్మన్ పదవి ఇవ్వాలని నేనావత్ రాజు నాయక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని, ఇతర నేతలను కోరుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, విద్యావంతులు, యువకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆశిస్తున్నామని యువ నేతలు పేర్కొంటున్నారు. పాండు నాయక్, అంగోత్ కృష్ణా నాయక్‌తో పాటు కందుకూరు మండలానికి చెందిన సభావత్ కృష్ణా నాయక్, ఆంజనేయులు నాయక్, లచ్చా నాయక్ కూడా తమకే ఇవ్వాలని అధిష్టానం పెద్దలను కలుస్తూ పైరవీలు మొదలు పెట్టారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఎవరి పేరు చెబితే వారే చైర్మన్, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు అవుతారని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

వీరే అర్హులు..

మార్కెట్ కమిటీలోని సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తి దారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు అర్హులు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలై ఉండాలి. కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఇక నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులుగా మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల్లో ఒక సభ్యుడు, మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్, మున్సిపల్ చైర్మన్, గ్రామ సర్పంచుల్లో ఒకరు ఉంటారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌ను 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

నూతన కమిటీ ఏకగ్రీవం

రాజేంద్రనగర్: ఆషాఢ మాసంలో పోచమ్మ తల్లికి ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు రజినీకాంత్‌గౌడ్ అన్నారు. డివిజన్ బుద్వేల్ గ్రామంలోని పోచమ్మ తల్లి దేవాలయం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీధర్‌గౌడ్, రాముగౌడ్, రాందేవ్‌రెడ్డి, జగదీష్‌వర్మ, బాబురావు, కుమార్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నరేష్‌యాదవ్, కోశాధికారిగా యాదగిరి గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా సాయిసాగర్, ధన్‌రాజ్, కిరణ్‌యాదవ్, సంతోష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, రమేష్‌ముదిరాజ్, వేణుగోపాల చారి, నరేష్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అశోక్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, సంతోష్‌చారి, జన్‌గౌడ్, పవన్, సందీప్‌లను నియమించారు.

బీఆర్‌ఎస్ ఖాళీ.. కాంగ్రెస్‌లో జోష్

- శేరిలింగంపల్లిలో మారిన రాజకీయ సమీకరణాలు
- ఒక్క ఒరలో రెండు కత్తులు ఇమిడేనా?

గచ్చిబౌలి: పార్లమెంట్ ఎన్నికల వరకు ఎంతో పటిష్టంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ.. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో ఖాళీ అయింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ భారీ మెజార్టీతో మూడోసారి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఎమ్మెల్యే, 9 మంది కార్పొరేటర్లతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎంతో పటిష్టంగా కనిపించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరడం, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్‌ఎస్ ఓడిపోవడంతో ఎమ్మెల్యే గాంధీ చూపు కాంగ్రెస్ వైపు మళ్లింది. కొద్ది రోజులుగా నాన్చుడు ధోరణితో వ్యవహరించిన ఆయన శుక్రవారం పార్టీ మారుతున్నట్లుగా స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ అధిష్టానం బుజ్జగింపులు ఫలించలేదు. రాత్రి కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసినా గాంధీ స్పందించలేదని తెలిసింది. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ క్యాడర్‌తో కాంగ్రెస్‌లో చేరారు. 2014లో టీడీపీ నుంచి గెలుపొందిన గాంధీ, 2018లో టీఆర్‌ఎస్ నుంచి గెలిచారు. 2023లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలుపొందారు. నేడు పార్టీని వీడటంతో శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్ ఖాళీ అయ్యింది.

కాంగ్రెస్‌లో జోష్..

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెంట శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో పాటు డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరిపోయారు. త్వరలో హైదర్‌నగర్ కార్పొరేటర్ శ్రీనివాస్ రావు, చందానగర్ కార్పొరేటర్ మంజుల, వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజా కాంగ్రెస్‌లో చేరనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఆయన సతీమణి పూజిత కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాగా బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లిలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఒక్కరే మిగిలారు. ఉద్యమ కారులు, బీఆర్‌ఎస్ సానుభూతి పరులు ఉన్నప్పటికీ క్యాడర్‌ను ఎవరు నడిపిస్తారనే చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి 80 వేల మెజార్టీ రావడం, బీఆర్‌ఎస్ మూడవ స్థానానికి పరిమితం కావడం ఆ పార్టీ శ్రేణులకు ఆందోళన కల్గించింది. ఇక బీఆర్‌ఎస్ జెండాను ముందుండి ఎవరు మోస్తారో వేచి చూడాల్సిందే.



పార్టీ కేడర్‌తో కాంగ్రెస్‌లో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఒక ఒరలో రెండు కత్తులు

బీఆర్‌ఎస్ నాయకులంతా ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన జగదీశ్వర్‌గౌడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాంధీ చేతిలో ఓటమి పాలయ్యారు. గాంధీ చేరికను గౌడ్ వర్గం వ్యతిరేకిస్తూ అసమ్మతి నేతగా మిగిలే అవకాశం ఉంది. ఇంచార్జిగా ఉన్న జగదీశ్వర్ గౌడ్, ఎమ్మెల్యే గాంధీ కలిసి పని చేస్తారా లేక వర్గ పోరును కొనసాగిస్తారా అనేది వేచి చూడాలి. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లిని రెండు నియోజకవర్గాలుగా చేసినా అప్పటి పరిస్థితులు ఎలా మారతాయో.. కాంగ్రెస్‌లో ఆరెకపూడి గాంధీ చేరికతో జగదీశ్వర్ గౌడ్ పరిస్థితి ఏంటనే చర్చ స్థానికంగా జరుగుతోంది. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకునే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పేద ప్రజలను ఆపదలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం 80 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదవారికి సీఎమ్మార్‌ఎఫ్ వరంగా మారిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని చెప్పారు. అధిక నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, నాయకులు వసంతం, ఆగిరెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, చెన్నయ్య, జనార్దన్, కవాలి రవీందర్, శేఖర్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

షాబాద్: ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి బొబ్బిలిగామ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్దాపురం నర్సింలు, లక్ష్మయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు రమేశ్(24) ఉన్నాడు. ఇద్దరు కూతుర్ల వివాహం అయింది. కుమారుడు రెండేళ్లుగా శంషాబాద్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ.. అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో మూడు రోజులుగా గ్రామంలోని ఇంటి వద్దే ఉన్నాడు. 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు పొలం వద్ద పనిచేస్తున్న తండ్రి నర్సింలుకు తాగడానికి నీళ్లు ఇచ్చి ఇంటికి వచ్చాడు. రాత్రి 7 గంటలకు తల్లి లక్ష్మమ్మ ఇంటికి వచ్చి చూడగా లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కిటికీ లోంచి చూడగా రమేశ్ ఉరికి వేలాడుతూ కన్పించాడు. ఇరుగుపొరుగు సహాయంతో తలుపులు పగలగొట్టి లోపల్లికి వెళ్లి చూడగా.. అప్పటికే రమేశ్ మృతి చెందాడు. తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం, జేసీబీ ఢీ..

వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో పడున్న యాదయ్య

కొందుర్గు: ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామానికి చెందిన గందె యాదయ్య(25) శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై కొందుర్గు మండలం పులుసుమామిడి గ్రామానికి వెళ్లాడు. తిరిగి కొందుర్గు మీదుగా లాల్‌పహాడ్ వైపు వెళ్తున్న క్రమంలో రాత్రి 8.30 గంటల ప్రాంతంలో జేసీబీ ఢీకొట్టింది. ఈ ఘటనలో యాదయ్య తలకు తీవ్ర గాయం అయింది. సమాచారం అందుకు పోలీసులు.. ప్రమాద స్థలానికి చేరకుని, క్షతగాత్రున్ని చికిత్స కోసం 108లో షాద్‌నగర్ సీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల పరీక్షించి యాదయ్య మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతుడికి భార్య సంతోష, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

కేంద్ర మంత్రికి సన్మానం



బండ్లగూడ : బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్, భూపాల్‌గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను శనివారం కలిసి సన్మానించారు. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రిని శాలువాలతో సత్కరించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీని బలోపేతం చేసేందుకు కార్పొరేటర్లు కృషి చేయాలని బండి సంజయ్ వారికి సూచించారు.

ఎమ్మెల్యేకు..



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు డివిజన్‌కు చెందిన పార్టీ నాయ కులు, కార్యకర్తలు శనివారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ బుద్వేల్ గ్రామ అధ్యక్షుడు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కానుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పలుగు చెరువు మహేష్, నరేందర్ ఉన్నారు.

నీటి సరఫరాలో ప్రెషర్ పెంచాలి

బండ్లగూడ: నీటి సరఫరాలో జాప్యం లేకుండా.. సరఫరా చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. రానున్న రోజుల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఎర్రకుంట వద్ద జలమండలి జీఎం, మేనేజర్‌తో సమావేశమయ్యారు. లైన్‌మెన్‌లకు సరిపడే బూస్టర్‌లను పెట్టించి నీటి సరఫరా చేసే గంట వరకు ప్రెషర్‌తో వదలాలని సూచించారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి..

ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పాత మసీదు ప్రాంతంలో డ్రైనేజీ లీకేజీలను ఆయన పరిశీలించారు.త్వరితగతిన డ్రైనేజీ లీకేజీ కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మసీదు ప్రాంతంలో మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్వలాభం కోసమే పార్టీలు మారుతున్న ఎమ్మెల్యే

మైలార్‌దేవ్‌పల్లి: స్వలాభం కోసం పార్టీలు మారుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 ఏళ్ల నుంచి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఓటర్లను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో కార్యకర్తలను మోసం చేస్తున్నారని తమ ఆస్తులను కాపాడుకోవడానికి అధికారంలో ఉన్న పార్టీలలో చేరుతున్నారన్నారు. శంషాబాద్, కోకాపేట్, పెద్ద గోల్కొండ గ్రామాలలో అనేక రకాల భూములను పేదల నుంచి తక్కువ ధరకు తీసుకొని కోట్ల రూపాయల ఆస్తులను సంపాదించారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌లో ఉండి ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు జనార్దన్, జోగి రవి, తిరుపతి రెడ్డి, రామకృష్ణ, బుచ్చిరెడ్డి, ఎల్‌వీ రెడ్డి, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వినాయక్ నగర్ ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్, మల్లీశ్వరి దంపతులు కూలిపనులు చేస్తుంటారు. ఈ నెల 7న వాకిలి సరిగా శుభ్రం చేయలేదని అత్త మల్లీశ్వరితో గొడవ పడింది. కాసేటి తర్వాత బయటికి వెళ్లిన మల్లీశ్వరి రాత్రైనా ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోదాం యజమానిపై చర్యలు తీసుకోవాలి

అత్తాపూర్: గృహ సముదాయాల ప్రాంతంలో గోదామును నిర్వహిస్తూ ప్రమాదాలకు కారణమైన యజమానిపై చర్యలు తీసుకోవాలని మహమ్మద్ ముస్తాక్ పోలీసులను ఆశ్రయించాడు. కొన్నేళ్లుగా మక్బుల్ అనే వ్యక్తి అక్రమంగా కట్టెల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సామర్థ్యానికి మించి కట్టెలు గోదాం ఉండడంతో శనివారం గోదాం సమీపంలో ఉన్న ముస్తాక్‌కు గృహ నిర్మాణానికి చెందిన ప్రహరీ కూలిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.